పేదవాడి గుండెచప్పుడు వైఎస్సార్..

- తిరుపతి, చంద్రగిరిలో ఘనంగా వైఎస్సార్ 15వ వర్ధంతి వేడుకలు
- పుష్పాంజలి ఘటించిన మాజీ ఎమ్మెల్యేలు భూమన, చెవిరెడ్డి, తిరుపతి ఎంపీ గురుమూర్తి
- అన్నదానం చేసి అభిమానులు



అన్నదానం వడ్డిస్తున్న టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర రెడ్డి, మేయర్ శిరీష, భూమన అభినయ్, ఎమ్మెల్సీ సిపాయి

తిరుపతి మంగళం : దేశ రాజకీయ చరిత్రలోనే ఎవరికీ సాధ్యం కానన్ని సంక్షేమ పథకాలు అందించి ప్రతి పేదవాడి గుండెచప్పుడుగా నిలిచిపోయిన మహోన్నత వ్యక్తి దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి అని తిరుపతి మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి అన్నారు. వైఎస్సార్ 15వ వర్ధంతి సందర్భంగా తిరుపతి తుడా సర్కిల్‌లోని వైఎస్సార్ విగ్రహానికి భూమన కరుణాకరరెడ్డి, మేయర్ డాక్టర్ శిరీష, ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం, తిరుపతి నియోజకవర్గ కన్వీనర్ భూమన అభినయ్ రెడ్డి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం సుమారు 2 వేల మంది పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు, కో–ఆప్షన్ సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

చంద్రగిరిలో..

తిరుపతి రూరల్: పేదల సంక్షేమం కోసం నిరంతరం తపించిన సంక్షేమ ప్రదాత దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి అని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, తిరుపతి ఎంపీ డాక్టర్ గురుమూర్తి కొనియాడారు. చంద్రగిరి నియోజకవర్గవ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు సోమవారం వైఎస్సార్ 15వ వర్ధంతి వేడుకలు నిర్వహించి ఘన నివాళులు అర్పించారు. వీరు చిన్నగొట్టిగల్లు మండలకేంద్రంలోని వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

ఆరు మండలాల్లో వర్ధంతి వేడుకలు

చంద్రగిరి నియోజకవర్గవ్యాప్తంగా ఉన్న ఆరు మండల కేంద్రాలతో పాటు గ్రామాల్లో సైతం మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి వేడుకలు నిర్వహించారు. పలుచోట్ల వైఎస్సార్‌సీపీ నేతలు అన్నదానం చేశారు.

వైఎస్సార్‌కు భారతరత్న ఇవ్వాలి

తిరుపతి సిటీ: పేద ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్న దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్‌కు భారతరత్న ప్రకటించాలని వైఎస్సార్‌సీపీ రాయలసీమ విద్యార్థి విభాగం ఇన్‌చార్జ్ వి.హరిప్రసాద్ కోరారు. సోమవారం వైఎస్సార్ 15వ వర్ధంతి సందర్భంగా ఎమ్మార్‌పల్లి పార్టీ కార్యాలయంలో ఆయన దివంగత నేత విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. పార్టీ నేతలు, విద్యార్థి సంఘం నాయకులు పాల్గొన్నారు.

మహానేతకు ఘన నివాళులు

రామచంద్రాపురం: మండలవ్యాప్తంగా జరిగిన వైఎస్సార్ వర్ధంతి వేడుకల్లో చెవిరెడ్డి ధ్యానేష్‌రెడ్డి పాల్గొని వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

మంగళంలో..

తిరుపతి మంగళం : చంద్రగిరి నియోజకవర్గం మంగళంలో సప్తగిరినగర్, రణధీర్‌పురం పంచాయతీలలో వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్‌లు అశోక్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, వార్డుమెంబర్లు, పార్టీ నాయకులు బీటీఆర్ కాలనీలోని వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పేదల దైవం డాక్టర్ వైఎస్సార్

తిరుపతి సిటీ: ఎస్వీయూ వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం అధ్యక్షుడు మన్నం ప్రేమ్‌కుమార్ ఆధ్వర్యంలో ఎస్వీ మెడికల్ కళాశాల వద్ద గల వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

చంద్రగిరి: స్థానిక టవర్‌క్లాక్ వద్ద జలయజ్ఞ ప్రదాత, ఫీజు రీయింబర్స్‌మెంట్ రూపకర్త, అపర భగీరథుడు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి విగ్రహానికి వైఎస్సార్‌సీపీ యువనేత చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సుమారు 500 మందికి అల్పాహారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

భాకరాపేటలో..

భాకరాపేట : చిన్నగొట్టిగల్లులోని వైఎస్సార్ విగ్రహం వద్ద పార్టీ శ్రేణులతో కలిసి వైఎస్సార్ విగ్రహానికి చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, తిరుపతి ఎంపీ మద్దెల గురుమూర్తి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ యుగంధర్‌రెడ్డి, జెడ్పీటీసీ స్వరూప, మహేంద్రరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు కొండారెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

పాకాలలో..

పాకాల : ప్రజల హృదయాల్లో సుస్థిరస్థానం సంపాదించిన మహానేత స్థానిక ఆర్టీసీ బస్టాండ్ కూడలిలో వైఎస్సార్ విగ్రహానికి చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి పాల్గొని వైఎస్సార్ విగ్రహానికి గజమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ నంగా నరేష్‌రెడ్డి, ఎంపీపీ లోకనాథం, నాయకులు పాల్గొన్నారు.



పెరుమాళ్లపల్లిలో అన్నదానం చేస్తున్న చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి, కె.మునీశ్వర్‌రెడ్డి



అన్నదానం చేస్తున్న చెవిరెడ్డి ధ్యానేష్‌రెడ్డి



మంగళం బీటీఆర్ కాలనీలో..



వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న రాయలసీమ విద్యార్థి విభాగం ఇన్‌చార్జ్ హరిప్రసాద్

మరపురాని నాయకుడు వైఎస్సార్



వైఎస్సార్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ సిపాయి

తిరుపతి తుడా/తిరుపతి కల్చరల్: మరపురాని నాయకుడు దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి అని ఎమ్మెల్సీ, రష్ ఆస్పత్రి అధినేత డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం అన్నారు. తిరుపతిలోని ఆయన నివాసంలో వైఎస్సార్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ ప్రవేశపెట్టిన పథకాలు, నిర్మించిన ప్రాజెక్టులు ప్రజల గుండెల్లో ఎప్పటికీ చిరస్థాయిగా నిలిచిపోతాయని అన్నారు. 41 సాగునీటి ప్రాజెక్టులు, 108, ఆరోగ్యశ్రీ, 104 పథకాలు వైఎస్సార్ పాలనకు చిహ్నాలని గుర్తు చేశారు. అలాంటి నేతకు మరణమే లేదని, ప్రజల గుండెల్లో ఎప్పటికీ బతికే ఉంటారని తెలిపారు.

డ్రగ్స్‌తో జీవితం అంధకారమే



మహిళా కమిషన్ చైర్‌పర్సన్ గజ్జల వెంకట లక్ష్మిని సన్మానిస్తున్న వక్తలు

తిరుపతి సిటీ: యువత డ్రగ్స్‌కు తలవంచితే జీవితం అంధకారమేనని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ గజ్జల వెంకటలక్ష్మి హెచ్చరించారు. పద్మావతి మహిళా వర్సిటీ, మహిళా అధ్యయన కేంద్రం, స్టూడెంట్ అఫైర్స్, రాష్ట్ర ఎక్సైజ్ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం వర్సిటీలోని ఇందిరా ప్రియదర్శిని ఆడిటోరియంలో మాదక ద్రవ్యాల దుర్వినియోగంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విజయవాడ గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ కాలేజ్‌లో జరిగిన అమానవీయ ఘటనలో 300 మంది విద్యార్థినులు ఉండడం బాధాకరమన్నారు. అనంతరం వీసీ ప్రొఫెసర్ ఉమ, అడిషనల్ ఎస్పీ రాజేంద్ర, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఆఫీసర్ జానకీరామ్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎస్.రజని, డీన్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.

బాధితులకు అండగా చెవిరెడ్డి



గాయపడిన వ్యక్తిని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి

తిరుపతి తుడా: రామచంద్రాపురం మండలం అనుపల్లిలో విద్యుత్ షాక్‌తో మృతి చెందిన యువకుడు, గాయపడిన యువకుడి కుటుంబాలకు మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి అండగా నిలిచారు. జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకల్లో అపశ్రుతి చోటుచేసుకుని విద్యుత్ షాక్‌తో గోపి (32) మృతి చెందాడు. మధురాయల్ తీవ్రంగా గాయపడి రుయా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలిసిన వెంటనే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి రుయా ఆస్పత్రికి చేరుకున్నారు. చికిత్స పొందుతున్న మధును పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మరణించిన గోపి కుటుంబానికి రూ.2 లక్షలు, గాయపడిన వ్యక్తికి వైద్య ఖర్చుల నిమిత్తం రూ.50వేలు ఆర్థిక సాయం చేస్తున్నట్లు ప్రకటించారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరగకుండా పోలీసులు, అధికారులు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఫ్లెక్సీల విష సంస్కృతి వల్ల ఎవరూ కుటుంబానికి దూరం కాకూడదని చెవిరెడ్డి అన్నారు. ఫ్లెక్సీల సంస్కృతి దూరం చేసేందుకు అన్ని పార్టీలు సహకరించాలని కోరారు.

వైఎస్సార్‌సీపీ నేత లోకనాథరెడ్డికి పరామర్శ

చిన్నగొట్టిగల్లు మండలం రంగన్నగారిగడ్డకు చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు లోకనాథరెడ్డి గత నాలుగు రోజుల క్రితం అనారోగ్యం బారిన పడ్డారు. చికిత్స నిమిత్తం తిరుపతి నారాయణాద్రి ఆస్పత్రిలో చేరారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి సోమవారం ఆస్పత్రికి వెళ్లి లోకనాథ రెడ్డిని పరామర్శించి ఆ కుటుంబానికి ధైర్యం చెప్పారు. అనంతరం ఆయన పరిస్థితి విషమంగానే ఉందని వైద్యులు చెప్పడంతో, మెరుగైన వైద్యం అందించాలని విజ్ఞప్తి చేశారు.

రుయా అధికారులపై విచారణ



విచారిస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ శ్రీహరి

తిరుపతి తుడా: తిరుపతి రుయా అధికారులపై సీఎస్ఆర్ఎంఓగా పనిచేసిన డాక్టర్ లక్ష్మానాయక్ ఇచ్చిన ఫిర్యాదులపై జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ శ్రీహరి సోమవారం విచారణ చేపట్టారు. అర్హత లేకున్నా అసిస్టెంట్ ఆర్ఎంఓగా డాక్టర్ హరికృష్ణకు బాధ్యతలు ఇచ్చారని, మహాప్రస్థానం, సప్తవర్ణ బెడ్‌షీట్ సరఫరా చేసే లియోటెక్ సంస్థ నుంచి అధికారులు అవినీతికి పాల్పడుతున్నారని రుయా ఏఓ రమేష్, పూర్వపు ఏడీ రత్నరాజుపై మూడు నెలల క్రితం జిల్లా కలెక్టర్, డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. స్పందించిన జిల్లా కలెక్టర్ విచారణ చేసి నివేదిక ఇవ్వాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శ్రీహరికి ఆదేశాలు జారీ చేయడంతో, ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆ ముగ్గురు డీఎంహెచ్ఓ కార్యాలయానికి రావడంతో వారి నుంచి రాతపూర్వకంగా వివరాలు సేకరించారు. విచారణ నివేదికను జిల్లా కలెక్టర్‌కు అందజేయనున్నట్లు డాక్టర్ శ్రీహరి చెప్పారు.

నిర్మాణ పనుల్లో వేగం పెంచాలి



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి తుడా: తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ (తుడా) ఆధ్వర్యంలో రాయల చెరువు రోడ్డులో నిర్మిస్తున్న తుడా టవర్స్ నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని తుడా ఉపాధ్యక్షురాలు, నగరపాలక సంస్థ కమిషనర్ ఎస్.మౌర్య అధికారులను ఆదేశించారు. నగరంలోని రాయల్ చెరువు రోడ్ లో నిర్మిస్తున్న తుడా టవర్స్, బాబు జగ్జీవన్ రామ్ పార్కు, శ్రీనివాసపురం వద్ద గల పార్కును, సూరప్పకశం తుడా లేఔట్‌ను, విమానాశ్రయం మార్గంలో సుందరీకరణ పనులను సోమవారం ఆమె పరిశీలించారు. గ్రౌండ్ ఫ్లోర్‌తో పాటు 13 అంతస్తులతో తుడా టవర్స్ ను నిర్మిస్తున్నామన్నారు. నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని చెప్పారు. ఉపాధ్యక్షురాలి వెంట సూపరింటెండెంట్ ఇంజినీర్ కృష్ణారెడ్డి, ఈఈ రవీంద్ర, డీఈ బాషా, ఉద్యానవన శాఖాధికారి మాలతి, ఏఈ షణ్ముగం, ఏపీఓ సూర్యనారాయణ ఉన్నారు.

తనిఖీలు చేయండి

తిరుపతి అర్బన్: అధికారులు కార్యాలయాలకే పరిమితం కాకుండా తనిఖీలు చేపట్టాలని, లోటుపాట్లను ఎప్పటికప్పుడు గుర్తించి మెరుగుపరచాలని కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ ఆదేశించారు. సోమవారం ఆయన కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. హాస్టల్స్‌లో మెరుగైన వసతులు కల్పించాలని, డెంగీ జ్వరాలతోపాటు సాధారణ జ్వరాలు గుర్తించి వాటికి పరిష్కారం చూపడానికి ఇంటింటా సర్వే చేపట్టాలని చెప్పారు. గ్రీవెన్స్‌లో వచ్చే అర్జీలకు గడువులోపు పరిష్కారం చూపాలని స్పష్టం చేశారు. నిర్లక్ష్యంగా ఉంటే క్రమశిక్షణా చర్యలు తప్పవని హెచ్చరించారు.

రూ.1.78 కోట్లకు ఐపీ

తిరుపతి లీగల్: తిరుపతి, తాతయ్య గుంటకు చెందిన వలసరెడ్డి ఇందిర, వీ.చెంగారెడ్డి తిరుపతి అదనపు సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో ఒక కోటి 78 లక్షల 95 వేల రూపాయలకు ఐపీ దాఖలు చేసినట్టు వారి తరపు న్యాయవాది కోటేశ్వర్‌రెడ్డి తెలిపారు. పిటిషన్‌లోని వివరాల మేరకు... చిన్నగొట్టిగల్లు మండలం, నల్లపరెడ్డి గారిపల్లికి చెందిన భార్యాభర్తలు ఇందిర, చెంగారెడ్డి తిరుపతి పీకే లేఔట్ లో కామధేను ఎంటర్‌ప్రైజెస్ పేరుతో పాటు హ్యాపీ హెల్త్ ఇండియా ఆర్గానిక్ వస్తువులను విక్రయిస్తూ వ్యాపారం చేసేవారు. వ్యాపార అభివృద్ధి కోసం ఇద్దరూ పలువురి వద్ద అధిక వడ్డీలకు అప్పులు చేశారు. అలాగే మొదటి ఫిర్యాది ఇందిర ప్రైవేటు చిట్స్ వ్యాపారం, తండాల్ వ్యాపారం నిర్వహించేవారు. చిట్స్ వ్యాపారంలో సొమ్ము తీసుకున్న వారు ఆమెకు తిరిగి చెల్లించలేదు. అలాగే తండల్ వ్యాపారంలో ఆమె కొంతమంది వద్ద సొమ్ము తీసుకుని వేరే వాళ్లకు అప్పుగా ఇచ్చేవారు. ఆమె వద్ద అప్పు తీసుకున్న వారు తిరిగి ఆమెకు చెల్లించలేదు. వ్యాపారాల్లో తీవ్ర నష్టాలు రావడంతో రుణదాతల అధిక వడ్డీలు చెల్లించలేక ఐపీ దాఖలు చేసినట్టు వారు పిటిషన్ లో పేర్కొన్నారు. రుణదాతల వేధింపులు ఎక్కువగా ఉండడంతో పోలీసుల రక్షణ కల్పించాలని వారు మరో పిటిషన్ దాఖలు చేశారు. 17 మంది రుణదాతలను వారు పిటిషన్లో ప్రతివాదులుగా చూపారు.

తిరుపతిలో కుండపోత వర్షం



తిరుమల బైపాస్ రోడ్డులో వర్షపు నీటిలో వాహనదారుల ఇబ్బందులు

తిరుపతి తుడా: తిరుపతిలో సోమవారం రాత్రి జోరు వాన కురుసింది. రాత్రి 10.20 గంటల నుంచి దాదాపు గంటపాటు కురిసిన వానతో నగరం తడిసి ముద్దయింది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. కాలువలు పొంగి ప్రవహించాయి. ముందస్తు హెచ్చరికల నేపథ్యంలో మున్సిపల్ కార్పొరేషన్ అప్రమత్తమయింది. వర్షం పడే అవకాశం ఉండడంతో యంత్రాంగాన్ని సంసిద్ధం చేశారు. జేసీబీలు వంటి వాహనాలు అందుబాటులో ఉంచారు.

హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు

తిరుపతి లీగల్: డబ్బు కోసం ఓ వ్యక్తిని హత్య చేసిన కేసులో తమిళనాడు, కాంచీపురం, వేలూరు రోడ్డు వినాయకపురానికి చెందిన రమేష్ ధరణీధరన్‌కు జీవిత ఖైదు, వెయ్యి రూపాయల జరిమానా విధిస్తూ తిరుపతి పదో అదనపు జిల్లా జడ్జి టీ. రామచంద్రుడు సోమవారం తీర్పుచెప్పారు. తిరుపతి ఈస్ట్ సీఐ మహేశ్వర్‌రెడ్డి, కోర్టు లైజనింగ్ ఆఫీసర్ ఈశ్వరయ్య, కోర్టు కానిస్టేబుల్ అయ్యప్ప తెలిపిన కేసులోని వివరాల మేరకు.... వైఎస్సార్ కడప జిల్లా, పెనగలూరు మండలం, చక్రంపేటకు చెందిన చిన్న ఓబుల్‌రెడ్డి అనారోగ్యం పాలు కావడంతో అతని కుమారుడు కే.నవీన్‌రెడ్డి మరో కుమారుడు కే.మాధవరెడ్డి అతన్ని తిరుపతి కొర్లగుంట సమీపంలోని ఓ హాస్పిటల్‌లో 2018 సెప్టెంబర్ 18న చేర్పించారు. మాధవరెడ్డి ఆ రోజు రాత్రి భోజనం కోసం హాస్పిటల్ నుంచి బజార్లోకి వచ్చాడు. అయితే అతను తిరిగి ఆస్పత్రి చేరుకోలేదు. దీంతో అతని సోదరుడు నవీన్‌రెడ్డి ఈస్ట్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేసి నిందితుడు రమేష్ ధరణి ధరన్‌తో పాటు మరో ఇద్దరిని అరెస్ట్ చేశారు. విచారణలో నిందితుడు ధరణి ధరన్ పై తమిళనాడులో పలు కేసులు ఉన్నట్టు పోలీసులు గుర్తించారు. నిందితుడు ధరణీధరన్ మరో ఇద్దరు బ్రహ్మోత్సవాలు జరుగుతున్న నేపథ్యంలో చోరీలు చేసి డబ్బు సంపాదించడానికి తిరుమలకు వచ్చారు. అయితే అక్కడ వీలు కాకపోవడంతో 2018 సెప్టెంబర్ 20వ తేదీ రాత్రి మద్యం తాగి స్థానిక శ్రీనివాసం సమీపంలోని పొదల వద్ద ఉండగా మృతుడు మాధవరెడ్డి తారసపడగా అతన్ని బెదిరించారు. అతను డబ్బు ఇవ్వకపోవడంతో కత్తులు, బ్లేడుతో అతనిపై దాడి చేసి హతమార్చారు. ఆపై అతని వద్ద ఉన్న 2,200 రూపాయలు, ఇతర కార్డులను దోచుకెళ్లారు. నిందితుడు ధరణి ధరన్ కోర్టుకు హాజరు కాకపోవడంతో న్యాయమూర్తి అతనికి నాన్ బెయిల్‌బుల్ వారెంట్ జారీచేస్తూ ఉత్తర్వులు జారీచేశారు. మరో ఇద్దరిపై కేసు విచారణ జరిపి నేరం రుజువు కాకపోవడంతో ఆ ఇద్దరిపై కేసు కొట్టి వేస్తూ తీర్పు చెప్పారు. తర్వాత ధరణి ధరన్‌కు జీవిత ఖైదు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరపున ఏపీపీ కోటేశ్వర రెడ్డి వాదించారు.

క్లుప్తంగా

కలెక్టర్‌ను కలిసిన ఏఎస్పీ



తిరుపతి అర్బన్: తిరుపతి జిల్లా లా అండ్ ఆర్డర్ అడిషనల్ ఎస్పీగా రవి మనోహరాచారి బాధ్యతలు చేపట్టిన తరువాత సోమవారం కలెక్టరేట్‌లో మర్యాద పూర్వకంగా జిల్లా కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్‌ను కలిశారు. ఆధ్యాత్మిక కేంద్రమైన తిరుపతిలో లాఅండ్‌ఆర్డర్ విషయంలో అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఆయనకు సూచించారు.

తైక్వాండో పోటీల్లో సంస్కృత వర్సిటీకి 14 పతకాలు



విద్యార్థులను అభినందిస్తున్న వీసీ, అధ్యాపకులు

తిరుపతి సిటీ: జాతీయ సంస్కృత వర్సిటీ వేదికగా చిత్తూరు జిల్లా తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఏపీ ఓపెన్ సీనియర్ మెన్ అండ్ ఉమెన్ తైక్వాండో చాంపియన్‌షిప్ టోర్నమెంట్‌లో సంస్కృత వర్సిటీ విద్యార్థులు 14పతకాలు సాధించారు. ఇందులో స్వర్ణపతకం ఒకటి, రజిత పతకాలు 5, ఎనిమిది కాంస్య పతకాలు సాధించారు. ఈ సందర్భంగా వీసీ జీఎస్‌ఆర్ కృష్ణమూర్తి, అధ్యాపకులు, డీన్లు విద్యార్థులను అభినందించారు.

రుయా ఏడీగా ధాత్రేశ్వరి



తిరుపతి తుడా: తిరుపతి రుయా ఆస్పత్రి పరిపాలన అసిస్టెంట్ డైరెక్టర్ (ఏడీ) ధాత్రేశ్వరిని ప్రభుత్వం నియమించింది. ఏ మేరకు ఆమె సోమవారం రుయా ఏడీగా బాధ్యతలు చేపట్టారు. మదనపల్లె ప్రభుత్వ ఆస్పత్రిలో పరిపాలన అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేశారు. ఈ మేరకు ఆమెను ప్రభుత్వం రుయాకు బదిలీ చేసింది.

సీపీఆర్‌పై అవగాహన

తిరుపతి సిటీ: జాతీయ సంస్కృత వర్సిటీ, పద్మావతి మహిళా వర్సిటీ మహిళా అధ్యయన కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో సంస్కృత వర్సిటీలో విద్యార్థులకు సీపీఆర్‌పై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. వీసీ జీఎస్‌ఆర్ కృష్ణ మూర్తి మాట్లాడుతూ సీపీఆర్‌పై అవగహన కలిగి ఉంటే ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఎంతోమందిని ప్రాణాలను కాపాడే అవకాశం ఉంటుందన్నారు. విద్యార్థులు ప్రతి ఒక్కరూ సీపీఆర్‌పై అవగాహన పెంచుకోవాలని కోరారు. కార్యక్రమంలో స్విమ్స్ కార్డియాలజిస్ట్ ప్రొఫెసర్ వనజ, డాక్టర్ వరుణ్ పాల్గొని విద్యార్థులకు అవగాహన కల్పించారు.

తిరుపతి రూరల్ సీఐగా చిన్నగోవిందు



తిరుపతి రూరల్: తిరుపతి రూరల్ సీఐగా చిన్నగోవిందు నియమితులయ్యారు. ఆ మేరకు సోమవారం ఆయన రూరల్ పోలీస్ స్టేషన్‌లో బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం సీఐగా ఉన్న సాధిక్‌అలీ కేవలం వారం రోజులకే బదిలీ కావడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ముక్కుసూటిగా ఉండే సాధిక్ అలీ రాజకీయ ఒత్తిళ్ల కారణంగా వారం రోజులకే బదిలీ చేశారని డిపార్ట్‌మెంట్‌లో గుసగుసలు వినపడుతున్నాయి. తిరుపతి రూరల్ మండలంలో ఇసుక, మట్టి, భూకబ్జాలపై వారం రోజుల్లోనే తనదైన మార్కును చూపి అక్రమార్కులకు చుక్కలు చూపించారు. ప్రత్యేక నిఘాతో లిక్విడ్ గంజాయిని పట్టుకున్నారు. ఈనేపథ్యంలో ఆయన ఉంటే తమ ఆటలు సాగవనే భయంతో వారంలోనే బదిలీ చేశారనే విమర్శలు ఉన్నాయి.

7న కపిలేశ్వరాలయంలో చవితి వేడుకలు

తిరుపతి కల్చరల్: శ్రీకపిలేశ్వరస్వామి వారి ఆలయంలో ఈనెల 7వ తేదీన వినాయక చవితి వేడుకలు ఘనంగా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక కార్యక్రమాలు జరగనున్నాయి. చవితి నాడు వినాయక స్వామి వారి మూలవర్లకు అభిషేకం, అర్చన చేపడతారు. సాయంత్రం 5.30 గంటలకు వినాయక స్వామివారికి మూషికవాహనంపై గ్రామోత్సవం నిర్వహిస్తారు. అలాగే రెండో ఘాట్ రోడ్డులోని శ్రీవినాయక స్వామివారి ఆలయంలో ఉదయం 8 నుంచి 9 గంటల వరకు మూలవర్లకు అభిషేకం నిర్వహిస్తారు.

5కే రన్‌లో ఎస్‌జీఎస్‌కు ఫస్ట్ ప్రైజ్‌లు



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపల్

తిరుపతి సిటీ: జిల్లా లెప్రసీ, ఎయిడ్స్ అండ్ టీబీ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో ఎన్‌సీసీ విద్యార్థులకు ఆదివారం జరిగిన 5కే మారథాన్ రన్‌లో బాలుర, బాలికల విభాగం రెండింటిలో స్థానిక ఎస్‌జీఎస్ ఆర్ట్స్ కళాశాల విద్యార్థులు ప్రథమ బహుమతులు గెలుచుకున్నారు. బీఎస్సీ ఫస్ట్ ఇయర్ చదువుతున్న చరణ్‌కుమార్ బాలుర విభాగంలో ప్రథమ బహుమతిగా రూ.7వేలు నగదు, ప్రశంసాపత్రాన్ని గెలుచుకున్నారు. అలాగే బాలికల విభాగంలో బీకాం తృతీయ సంవత్సరం చదువుతున్న కే.సాయిప్రియ ప్రథమ స్థానంలో నిలిచి రూ.7 వేలు నగదు, ప్రశంసాపత్రాన్ని అందుకుంది. ప్రతిభ చూపిన విద్యార్థులను ప్రిన్సిపల్ డాక్టర్ సత్యనారాయణ ప్రత్యేకంగా అభినందించారు.

దాడిలో భర్త హతం



మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ మహేశ్వర్‌రెడ్డి

తిరుపతి క్రైమ్: భర్తపై దాడిచేసి అతి దారుణంగా హతమార్చిన ఘటన ఆదివారం నగరంలో కలకలం రేపింది. ఈస్ట్ సీఐ మహేశ్వర్‌రెడ్డి కథనం.. కొర్లగుంట మారుతీనగర్‌లో నివాసముంటున్న సుబ్రహ్మణ్యం(35), సుజాతకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఇతను ట్యాక్సీ నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల తరచూ భార్యపై అనుమానంతో గొడవపడి ఆమెను వేధించేవాడు. ఆదివారం రాత్రి కూడా గొడవ పడడంతో సుజాత వారి తల్లిదండ్రులైన జయమ్మ, నాగరాజుకు సమాచారం అందించింది. వీరు చిత్తూరు నుంచి తిరుపతికి చేరుకొని సుబ్రహ్మణ్యంకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. కానీ వినిపించుకోలేదు. ఆపై వారి ముందే భార్యపై దాడి చేశాడు. తర్వాత కర్రతో ముగ్గురూ కలుసుకొని సుబ్రమణ్యంపై ఎదురు దాడి చేశారు. ఈ క్రమంలో తలకు బలమైన గాయం కావడంతో సుబ్రహ్మణ్యం అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు.

విపత్తులతో ప్రజలు అల్లాడిపోతున్నారు

తిరుపతి(అలిపిరి): ప్రకృతి విపత్తుతో ప్రజలు అల్లాడిపోతున్నారని.. కేంద్రం ఆంధ్రప్రదేశ్‌కు రూ.5 వేల కోట్లు సాయం అందించాలని కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన తిరుపతిలో విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం వెంటనే ఆర్థిక సాయం అందించి వరద బాధితులను ఆదుకోవాలని కోరారు. ఏపీలో వరద నష్టం తీవ్రత ఎక్కువగా ఉందన్నారు. పంటలు నష్టపోయిన రైతులను వెంటనే ఆదుకోవాలన్నారు. ప్రధానంగా విజయవాడ, గుంటూరు, గోదావరి జిల్లాల్లో వందలాది కాలనీలు జలవాసాలుగా మారాయని, జనం జల దిగ్బంధంలో ఉన్నారని వాపోయారు.

నలుగురికి జైలు

తిరుపతి లీగల్ : అధిక మోతాదులో మద్యం తాగి తిరుపతిలో వాహనాలు నడుపుతున్న నలుగురికి జైలుశిక్ష, జరిమానా విధిస్తూ తిరుపతి నాలుగో అదనపు జూనియర్ సివిల్‌జడ్జి గ్రంధి శ్రీనివాస్ సోమవారం తీర్పు చెప్పారు. చంద్రగిరి మండలం కొటాళ్లకు చెందిన ఆటోడ్రైవర్ వెంకటసాయి, తిరుపతి, ఇందిరానగర్‌కు చెందిన ఆటోడ్రైవర్ ఏ.సాంబశివ, పాపానాయుడుపేట, విశ్వతమాలకు చెందిన ద్విచక్ర వాహన చోదకుడు ప్రకాష్, వైఎస్సార్ కడప జిల్లా ఆవులరెడ్డిపల్లికి చెందిన ద్విచక్ర వాహన చోదకుడు జగదీశ్వర్ రెడ్డికి ఒక్కొక్కరికి రెండు రోజుల చొప్పున జైలు శిక్ష, రూ.10 వేలు చొప్పున జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. అలాగే స్వల్ప మోతాదులో మద్యం తాగి వాహనాలు నడుపుతున్న 12 మందికి ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

తిరుమల లడ్డూపై ఆంక్షలు ఎత్తివేయాలి

తిరుపతి కల్చరల్: తిరుమల లడ్డూపై ఆంక్షలు విధిస్తూ టీటీడీ ఈఓ శ్యామలరావు, అడిషనల్ ఈఓ వెంకయ్య చౌదరి చేసిన ప్రకటన అర్థం లేదని, తక్షణం ఈ ఆంక్షలను ఎత్తివేయాలని టీటీడీ ఉద్యోగ, కార్మిక సంఘాల గౌరవాధ్యక్షుడు కందారపు మురళి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. తిరుమల ఆలయానికి భక్తుల తాకిడి విపరీతంగా పెరిగిందని, కరోనా తర్వాత లక్షల సంఖ్యలో భక్తులు పోటెత్తుతున్నారని పేర్కొన్నారు. అయితే ఎవరో పెళ్లిలో లడ్డూలను పంచిపెట్టారని, ఆ కారణంగా ఈ విధానం తీసుకువచ్చామని చెప్పడం అర్థరహితమని ఆరోపించారు.


ప్రజల సమస్యలు పరిష్కరించాలి

తిరుపతి తుడా: అర్జీదారులు సంతృప్తి పడేలా వారి సమస్యలను పరిష్కరించాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎస్.మౌర్య అధికారులను ఆదేశించారు. సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించగా 60 మంది నేరుగా వచ్చి తమ సమస్యలను వినతుల రూపంలో అందజేశారు. కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

ప్రమాదాలను అరికట్టండి

తిరుపతి కల్చరల్: జీవకోన, రాజీవ్‌గాంధీ కాలనీ మెయిన్ రోడ్డులోనున్న మసీద్–ఏ–మహమ్మదీయ వద్ద కాలువ వంకర టింకరగా నిర్మించడంతో వాహనదారులు కాలువలో పడడంతో పాటు పాదచారులు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారని, కాలువను బాగు చేసి ప్రమాదాలను అరికట్టాలని ముస్లింలు విజ్ఞప్తి చేశారు

సహాయ కార్మిక శాఖాధికారిగా ప్రవీణ్‌కుమార్



తిరుపతి రూరల్: తిరుపతి సర్కిల్–1 సహాయ కార్మికశాఖాధికారిగా ప్రవీణ్‌కుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. కార్మికశాఖలో సీనియర్ అసిస్టెంట్‌గా ఉన్న ప్రవీణ్‌కుమార్‌కు ఇటీవల ఏఎల్‌ఓగా పదోన్నతి లభించింది. ఈనేపథ్యంలో తిరుపతి జిల్లాలోనే కీలకమైన తిరుపతి, తిరుమల సర్కిల్ ఏఎల్‌ఓగా ఆయనను నియమిస్తూ కార్మికశాఖ సంయుక్త కమిషనర్ బాలునాయక్ ఉత్తర్వులు జారీ చేశారు. కార్మిక సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తామని ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

నిష్పక్షపాతంగా జరపాలి

తిరుపతి(అలిపిరి): పన్నెండేళ్ల అనంతరం జరుగుతున్న రైల్వే ఎన్నికలను నిష్పక్షపాతంగా నిర్వహించాలని ఇండియన్ రైల్ మజ్దూర్ యూనియన్ సెంట్రల్ కమిటీ జోనల్ అధ్యక్షుడు వీరయ్య అన్నారు. సోమవారం ఆయన అధ్యక్షతన తిరుపతి పద్మావతీ నగర్‌లోని కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రిజిస్టర్ ట్రేడ్ యూనియన్లు అన్నింటికీ సమాన అవకాశాలు కల్పించి ఎన్నికల్లో లెవెల్ ప్లేయింగ్ అమలు చేయాలని రైల్వే యాజమాన్యాన్ని కోరారు.